పేరు ‘సర్దార్’.. దందా జోర్దార్

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వాలకు చిల్లిగవ్వ కూడా చెల్లించకుండా సాగుతున్న ఈ అక్రమ దందాలో రాష్ట్రంలోని అధికార పార్టీకి చెందిన నేతలు ఉన్నట్టు సమాచారం. రాష్ట్రంలో అధికారం మారిన వెంటనే ఇసుక క్వారీలను చెరబట్టిన వీళ్లు.. తొలుత ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించారు. తర్వాత ఇసుక సరఫరా లేదంటూ ధరలు పెంచారు. అధికారులేమో.. పత్రికల్లో వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలు, మేం చెప్పిందే నిజం అంటూ తమకు తామే సర్టిఫికెట్లు ఇచ్చుకున్నారు. ఇప్పుడేమో సుమారు 70 లారీలు ఆంధ్రప్రదేశ్‌లోని గుండాల నుంచి ఇసుకలోడ్‌తో ఖమ్మం జిల్లాలోని సారపాక ప్రాంతానికి వచ్చాయి. వీటిని గమనించిన స్థానికులు ఎస్పీ, కలెక్టర్, మైనింగ్ సహా ఇతర అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో 17 ఇసుక లారీలను భద్రాచలం సమీపంలోని సారపాక క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకున్నారు. మిగిలిన లారీలు అక్కడి నుంచి జారుకున్నాయి. వీటిని స్థానిక మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు బూర్గంపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. విచిత్రం ఏమిటంటే.. లారీల్లోని ఒక్క డ్రైవర్ కూడా పట్టుబడలేదు. అందరూ పరారయ్యారు.

సారపాక వద్ద పట్టుబడ్డ లారీ అద్దాలపై సర్దార్ అనే అక్షరాలు, సీఎం రేవంత్ ఫొటో

విడిచిపెట్టాలని మంత్రి పేషీ నుంచి ఫోన్లు

ఇసుక లారీలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన వెంటనే రంగంలోకి దిగిన ఓ మంత్రి పీఏ, అధికారులకు ఫోన్లు చేయడం మొదలుపెట్టారు. సదరు పీఏ సీఎం కార్యాలయం సూచన మేరకు మంత్రి వద్ద పనిచేస్తున్నారని తెలిసింది. ఆయన బుధవారం ఉదయం నుంచి అధికారులకు ఫోన్లు చేస్తూనే ఉన్నారని సమాచారం. అయితే, విషయం అప్పటికే బయటకు రావడం, మీడియాలో కూడా రావడంతో ఏమీ చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. మంత్రి పేషీ నుంచి ఫోన్లు వచ్చిన విషయం కూడా బయటకు పొక్కింది. దీంతో సదరు మంత్రి ‘జాగ్రత్త’గా డీల్ చేయాలని, లేదంటే పరువు పోతుందని చెప్పి ఆయనను మీడియా కంటక పడకుండా ఉండాలని చెప్పినట్టు తెలిసింది. మేడారం జాతర బిజీలో ఉన్నానని, తర్వాత విపులంగా మాట్లాడుదామని ఆ మంత్రి పీఏతో చెప్పినట్టు సమాచారం.

అద్దాలు పగులగొట్టి

రేవంత్ రెడ్డి ఫొటోతో సర్దార్ అని అద్దాలపై రాసి ఉన్న లారీలను అధికారులు పట్టుకోవడంతో కొంతమంది డ్రైవర్లు అప్పటికప్పుడు లారీ అద్దాలను సైతం పగులగొట్టారు. మీడియా ప్రతినిధులు వచ్చి ఫొటోలు తీయబోతుండగానే అద్దాలు పగులగొట్టి పరారవ్వడం గమనార్హం. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రాష్ట్రంలోని ముఖ్యమైన ఇసుక ర్యాంపులను మూసివేయడం అనుమానాలకు తావిస్తున్నది. కరీంనగర్, మణుగూరు, నిజామాబాద్ తదితర చోట్ల క్వారీలను బంద్ పెట్టారు. దీనికి రాజకీయ కారణాలున్నాయని చెప్తున్నారు. టీఎస్ఎండీసీ పాత్రను తక్కువ చేయడం, వినియోగదారులకు టీఎస్ఎండీసీ నుంచి ఇసుక అందకుండా చేయటంలో మతలబు ఏమిటన్న ప్రశ్న వస్తున్నది.

ఏపీ సరిహద్దుల్లో 5 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక డంప్?

ఖమ్మం జిల్లా తర్వాత, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 5 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక డంప్ ఉన్నట్టు సమాచారం. దీన్ని తెలంగాణకు చెందిన కొందరు హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. రోజూ వంద నుంచి 120 లారీల్లో ఇసుకను మన రాష్ట్రంలోకి తరలిస్తున్నారు. గడిచిన 12 రోజులుగా ఈ దందా కొనసాగుతున్నదని విశ్వసనీయ సమాచారం. ప్రతీరోజూ ఈ తరహాలో ఇసుకను తరలించడం వల్ల ఇసుక కాంట్రాక్టర్లకు ఖర్చులన్నీ పోను రూ.కోటి వరకు మిగులుతున్నట్టు సమాచారం. అంటే 12 రోజుల్లో వీళ్లు ఇక్కడి నుంచి తరలించిన ఇసుకతో రూ.12 కోట్లు అక్రమంగా ఆర్జించినట్టు తెలుస్తున్నది.

ఓవర్‌లోడ్‌తో లారీలు

ఇసుక లారీల్లో పరిమితికి మించి ఇసుకను సరఫరా చేస్తున్నారు. సాధారణంగా ఒక లారీలో 30-35 టన్నుల ఇసుకను నింపుతుంటారు. కానీ, ఆంధ్ర నుంచి వచ్చే వాటిల్లో ఒక్కొక్క లారీలో 45-50 టన్నుల ఇసుకను నింపుతున్నారు. ఒక్కో లోడ్‌ను తెలంగాణలో రూ.లక్ష నుంచి రూ.లక్షా 20 వేలకు అమ్ముతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఓవర్‌లోడ్‌తో వచ్చే లారీలను అనుమతించడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. దీనివెనుక అతిపెద్ద ముఠా పనిచేస్తున్నదని సమాచారం. గతంలో ఆంధ్ర ప్రాంతంలో పనిచేసిన ఓ అధికారి ఇప్పుడు తెలంగాణలో కూడా చక్రం తిప్పుతున్నారు. ఆయన కనుసన్నాల్లోనే అంతా జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. మైనింగ్ అధికారులు విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి ఇలాంటి అక్రమ ఇసుక రాష్ట్రంలోకి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. కానీ, ఇక్కడ మాత్రం భిన్నంగా జరుగుతున్నది. రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణా, ధరలపై గతంలోనే ‘నమస్తే తెలంగాణ’ హెచ్చరించింది. అయితే, అధికారులు దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా ఉండదని కొట్టిపారేశారు. కానీ, సారపాక వద్ద పెద్దఎత్తున అక్రమ ఇసుక దొరకడంతో అధికారుల పరిస్థితి కక్కలేక మింగలేక అన్నట్టుగా మారింది.

ముఖ్యమంత్రి ఫొటో పెట్టుకొని దర్జాగా రవాణా

ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నవాళ్లు బాజాప్తా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోను తమ లారీ ముందు భాగంలోనే పెయింట్ చేయించుకోవడం, దాని పక్కనే సర్దార్ అని రాయించుకోవడం గమనార్హం. సీఎం ఫొటో ఉన్న లారీతోపాటు వచ్చే వాహనాలను సరిహద్దుల్లో ఆపవద్దని రాష్ట్రంలోని ఓ కీలక అధికారి మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. రేవంత్‌రెడ్డి ఫొటో ఐడియా కూడా ఆ అధికారే ఇచ్చినట్టు తెలిసింది. సీఎం ఫొటోను, సర్కార్ అని లారీపై బాజాప్తా రాయించి మరీ ఇసుకను తరలిస్తున్నారంటే ఏదో మతలబు ఉండి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 17 లారీలను పట్టుకొంటే ఒక్క డ్రైవర్ కూడా దొరక్కపోవటం కూడా విచిత్రంగా ఉన్నది.

సిద్దిపేట వెటర్నరీ కళాశాల శంకుస్థాపనలో పాల్గొన్న అప్పటి మంత్రులు హరీశ్‌రావు, తలసాని (ఫైల్)

సిద్దిపేట వెటర్నరీ కళాశాలపై సీఎం కన్ను!

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ పశువైద్య విద్యాలయం (వెటర్నరీ కళాశాల) మంజూరు చేసింది. 30 ఎకరాల విస్తీర్ణంలో కళాశాల నిర్మాణం కోసం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మొత్తం రూ. 180 కోట్లు మంజూరు చేశారు. నిరుడు మే 7న అప్పటి మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ భూమిపూజ చేశారు. రూ. 100 కోట్లు కేటాయించడంతో పనులు కూడా జరుగుతున్నాయి. రాష్ట్రంలో హైదరాబాద్, కోరుట్ల, వరంగల్‌లో మూడు పశువైద్య కళాశాలలు ఉన్నాయి. ఈ మూడు కళాశాలల్లో 240 మంది మాత్రమే చదువుకొనే వీలుండగా, సిద్దిపేట కళాశాల అందుబాటులోకి వస్తే మరో 80 మంది విద్యార్థులకు ప్రవేశాలు లభించి ఉండేవి. ఈ నేపథ్యంలో 2024 నుంచి ఇక్కడ తరగతులు ప్రారంభించాలని కూడా నాటి ప్రభుత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ సర్కారు మాత్రం ఇప్పుడీ కళాశాలను కొడంగల్ నియోజకవర్గానికి తరలించాలని యోచిస్తున్నది. అందులో భాగంగా 25 మంది బోధన, బోధనేతర సిబ్బంది నియామకాన్ని నిలిపివేసింది. పనులు చేపట్టవద్దంటూ అంతర్గతంగా అధికారులకు ఆదేశాలు కూడా వెళ్లినట్టు తెలిసింది. దీంతో రెండునెలలుగా పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే చందంగా తయారయ్యాయి.

రెండు నెలల్లో 3,695 కోట్లు సొంత నియోజకవర్గానికి నిధుల మళ్లింపు

ముఖ్యమంత్రి అయ్యాక రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గమైన కొడంగల్‌పై ప్రత్యేక దృష్టిపెట్టారు. అభివృద్ధి పనుల కోసం రెండు నెలల్లోనే వేల కోట్లు మళ్లించారు. వికారాబాద్ జిల్లాకు మెడికల్ కాలేజీ, కొడంగల్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా మెడికల్ కాలేజీతోపాటు ఇంజినీరింగ్, జూనియర్, డిగ్రీ కాలేజీలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ క్రమంలో వేలకోట్ల నిధులను కొడంగల్‌కు తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 3,695 కోట్లు కేటాయించింది. వీటిలో రూ. 2,945 కోట్లను కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీతోపాటు నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్ కాలేజీల కోసం రూ. 224 కోట్లతో పరిపాలన అనుమతులు కూడా ఇచ్చింది. నియోజకవర్గంలో పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి రూ. 204 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధి కోసం రూ.322 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నెల 17 లేదంటే 18న కొడంగల్‌లో పర్యటించనున్న సీఎం రేవంత్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

నేడు బంజారా ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

హైదరాబాద్, ఫిబ్రవరి14 (నమస్తే తెలంగాణ): బంజారా కమ్యూనిటీకి చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 15న ప్రభుత్వం ప్రత్యేక సెలవును మంజూరు చేసింది. గురువారం సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా ఈ నిర్ణయం తీసుకొన్నది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బీసీలకు బీజేపీ మోసం

- జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి14 (నమస్తే తెలంగాణ): బీసీలను మరోసారి బీజేపీ మోసం చేసిందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. పార్టీ శాసనసభాపక్ష నేతగా మహేశ్వర్‌రెడ్డిని నియమించిన బీజేపీ ‘బీసీ సీఎం’ నినాదాన్ని బుట్టదాఖలు చేసిందని ధ్వజమెత్తారు. అధికారంలోకొస్తే బీసీని సీఎం చేస్తామని ఇప్పుడు పార్టీపక్ష నేత పోస్టును అగ్రకులాలకు కేటాయించడంపై మండిపడ్డారు.

పదేండ్లు నేనే సీఎం

ఎల్బీ స్టేడియంలో కానిస్టేబుల్ నియామక పత్రాలు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి...

సర్కార్ జారీ చేసిన నోటిఫికేషన్ల కారణంగా కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన 13,444 మంది అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గతంలో వేసిన రిక్రూట్‌మెంట్లకు న్యాయపరమైన అడ్డంకులను పరిష్కరిస్తూ నియామక పత్రాలు ఇస్తున్నామని చెప్పారు. నిరుద్యోగులను ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నుంచి బయట పడేయాలనేదే తమ ప్రయత్నమని చెప్పారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు తమ కుటుంబమని అన్నారు. ‘ఈ వేదికగా చెబుతున్నా.. మీ రేవంతన్నగా నిరుద్యోగ యువకులకు నేను అండగా ఉంటా’ అని స్పష్టం చేశారు. ఇప్పటికే నర్సింగ్ ఆఫీసర్స్, సింగరేణి ఉద్యోగాల్లో చిక్కుముడులు విప్పి నియామకాలు పూర్తి చేశామని చెప్పారు. ఏ తప్పూ లేకుండా.. ఎవరికీ నష్టం జరగకుండా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. నిరుద్యోగుల కోసం అర్హత వయసును 44 నుంచి 46 ఏండ్లకు పెంచామన్నారు. తెలంగాణను కబళించడానికి గంజాయి, డ్రగ్స్ ముఠాలు తిరుగుతున్నాయని, వాటిని కూకటివేళ్లతో పెకిలించాల్సిన బాధ్యత మీపై ఉందని పోలీస్ అధికారులకు సూచించారు. తెలంగాణ యువతను నిర్వీర్యం చేసే గంజాయి, డ్రగ్స్ ముఠాలు రాష్ట్రంలో ఉండకూడదన్నారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ **కొలువులు**
కాంగ్రెస్ **కాగితాలు**

కేసీఆర్ ఉద్యోగాలకు రేవంత్ సభలా?

- బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ విమర్శ

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ఎవరికో పుట్టిన పిల్లలకు పేరు పెట్టినట్టు.. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు సీఎం రేవంత్‌రెడ్డి సభ పెట్టుకోవటం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలాంటి చిల్లర ప్రచారం చేసుకోలేదని, అది రేవంత్ రెడ్డికే సాధ్యమైందని విమర్శించారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలలు దాటినా ఇప్పటికీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టలేదని దుయ్యబట్టారు. 60 ఉద్యోగాలకు ఆర్థిక శాఖ అనుమతిచ్చిందని, ఇంకా 1,99,940 ఉద్యోగాలకు ఆర్థిక శాఖ నుండి ఎప్పుడు అనుమతి ఇస్తావో కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు ఎల్బీ స్టేడియంలో సభ పెట్టుకొని రాజకీయాలు మాట్లాడటం బంద్ చేయాలని కోరారు. కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారానే 16,027 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యామన్న విషయం అభ్యర్థులకు తెలుసునని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లను తానే ఇచ్చినట్టుగా భావించి.. సీఎం రేవంత్‌రెడ్డి రెండు లక్షల ఉద్యోగాల హామీని మరిచిపోయారని ఎద్దేవా చేశారు. త్వరలో ఉద్యోగాల భర్తీ కార్యాచరణ ప్రకటించకపోతే సీఎంను నిరుద్యోగులు వెంటబడి నిలదీయడం ఖాయమని గెల్లు శ్రీనివాస్ హెచ్చరించారు.

● హరితం అలక్ష్యం.. ఎండిన వనం

పల్లెలు పచ్చని హరిత వనాలుగా మారాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలం దేశాయిపల్లిలో మూడేండ్ల కిందట అర ఎకరం భూమిలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం నిర్వహణ లోపంతో ఎండిపోయింది. ఇక్కడ దాదాపు 2 వేల మొక్కలను నాటి రెండేండ్ల పాటు ఎన్ఆర్ఈజీఎస్ సంరక్షించింది. తర్వాత సర్పంచుల పదవీ కాలం ముగిసిపోవడంతో వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో 90 శాతం చెట్లన్నీ ఎండిపోయాయి. -మహ్మదాబాద్

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

- మిర్యాలగూడలో నిలిపి మరమ్మతులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 14: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులోని డీ-3 బోగిలో బుధవారం ఉదయం పొగలు వచ్చాయి. దీంతో మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో కొద్దిసేపు రైలును నిలిపివేశారు. ఉదయం 9 గంటలకు కుక్కడం రైల్వేస్టేషన్ దాటిన వెంటనే రైలులో పొగలు రావడాన్ని గుర్తించిన ప్రయాణికులు రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. రైలు అప్పటికే మిర్యాలగూడ స్టేషన్‌కు చేరుకోవడంతో సిబ్బంది రైలును నిలిపి పరిశీలించారు. చక్రాల బేరింగ్ వద్ద ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా పొగలు వచ్చినట్టుగా గుర్తించి సరిచేశారు. 25 నిమిషాల తరువాత రైలును పంపించారు.

మిర్యాలగూడలో నిలిపివేసిన జన్మభూమి సూపర్ ఫాస్ట్ రైలు

బరాజ్‌లలో లోపాలపై ఎన్డీఎస్ఏ విచారణ

- నీటి పారుదల ప్రాజెక్టులపై త్వరలో శ్వేతపత్రం
- చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌లలోని లోపాలపై విచారణ జరపాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ)ను కోరుతామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వడానికి ఎన్డీఎస్ఏనే అత్యుత్తమైనదిగా భావిస్తున్నామని చెప్పారు. అసెంబ్లీలో బుధవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిచ్చాపాటి మాట్లాడారు. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుపై ప్రథమంగా పోలీసు స్టేషన్‌లో అధికారులు చేసిన ఫిర్యాదు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదికలను కూడా పరిగణనలోకి తీసుకొని విచారణ జరపాలని ఎన్డీఎస్ఏను కోరుతామని చెప్పారు. మేడిగడ్డ పరిస్థితి ఏమిటన్నది చెప్పడానికి తామేమీ ఇంజినీరింగ్ నిపుణులం కాదని అన్నారు. పాలమూర్-రంగారెడ్డి ప్రాజెక్టుపై ఏమీ లేకుండానే రూ.25 వేల కోట్లు ఖర్చు పెట్టిందని ఆరోపించారు. మేడిగడ్డ ప్రాజెక్టుతో పాటు ఇతర నీటిపారుదల ప్రాజెక్టులపై సభలో శ్వేతపత్రం విడుదల చేస్తామని, అది ఎప్పుడు అనేది ఇంకా ఖరారు కాలేదని అన్నారు.

కాంగ్రెస్‌లో చేరినవారికి బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో పార్టీ కండువా కప్పుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సచివాలయమా? గాంధీభవనా?

- సెక్రటేరియట్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు
- మంత్రి ఉత్తమ్ చాంబర్‌లో సూర్యాపేట నేతల చేరిక
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పరిపాలనా భవనమైన సచివాలయం కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకునే గాంధీభవన్‌గా మారిపోయింది. గాంధీభవన్‌లో జరగాల్సిన కార్యక్రమాలను మంత్రులే సచివాలయంలో నిర్వహిస్తున్నారు. ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ చేరికల కార్యక్రమానికి సచివాలయాన్ని వేదికగా మార్చేశారు. సూర్యాపేటకు చెందిన పలువురు ఇతర పార్టీల కౌన్సిలర్లు, నేతలు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అక్కడ గ్రూప్ ఫొటో కూడా దిగారు. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలన భవనాన్ని పార్టీ భవనంగా మార్చడం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మొన్నటికి మొన్న మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఉన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సచివాలయంలోని తన చాంబర్‌లో పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. ఇప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి ఏకంగా పార్టీ చేరికల కార్యక్రమాన్నే నిర్వహించారు. ఇక మున్ముందు ఇలాంటివి మరెన్ని చూడాల్సి వస్తుందోననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇకపై పార్టీ, పాలన కార్యక్రమాలన్నీ సచివాలయంలోనే చేస్తారేమో అనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానానికి హాజరైన కౌన్సిలర్లు, అధికారులు

మేడిగడ్డ పిక్నిక్ బాగుందా?

- మంచి టిఫిన్, భోజనం పెట్టారా?
- కాంగ్రెస్ టూర్‌పై బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సెటైర్



హైదరాబాద్, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా ఇతర మంత్రుల మేడిగడ్డ పర్యటనపై బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సెటైర్లు వేశారు. మేడిగడ్డ పిక్నిక్ బాగుందా? మంచి టిఫిన్లు, భోజనం పెట్టారా? అని కాంగ్రెస్ సభ్యులను ఉద్దేశించి కామెంట్ చేశారు. మీ సీఎం మంచోడని, ఎప్పుడు మూడొస్తే అప్పుడు మేడిగడ్డ టూర్‌కు తీసుకెళ్లారని సెటైర్ వేశారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. వాటిని నెరవేర్చేందుకు దేశ బడ్జెట్ కూడా సరిపోదని పేర్కొన్నారు. అసెంబ్లీలో మరోమారు ఏబీసీడీ వర్గీకరణ తీర్మానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌తో తమ పార్టీ ఒప్పందం చేసుకున్నదంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉండగా కాళేశ్వరంపై సీబీఐ విచారణకు డిమాండ్ చేసిన రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు ఆ పని చేయడం లేదని ప్రశ్నించారు.

బీజేపీఎల్పీ నేతగా మహేశ్వర్‌రెడ్డి

అసెంబ్లీలో బీజేపీ శాసనసభాపక్ష నేతగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎంపికయ్యారు. మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బుధవారం ప్రకటన విడుదల చేశారు. దీంతో బీజేపీ ఎల్పీ నేత ఎవరనే ప్రశ్నకు రెండు నెలల తర్వాత తెరపడింది. డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా పాయల్ శంకర్, కాటిపల్లి రమణారెడ్డిని నియమించారు. బీజేపీ చీఫ్ విప్‌గా డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు, విప్‌గా ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాను నియమించారు. కోశాధికారి బాధ్యతలను రాకేశ్‌రెడ్డికి అప్పగించారు. మండలిలో బీజేపీ పక్ష నేతగా ఏవీఎన్‌రెడ్డి నియమించారు. అయితే మొదటి నుంచి బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్న సీనియర్ ఎమ్మెల్యే రాజాసింగ్ ను పూర్తిగా పక్కన పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

బడ్జెట్ తప్పుల తడక

- సర్కారును తూర్పార పట్టిన ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, ఫిబ్రవరి14 (నమస్తే తెలంగాణ): బడ్జెట్ పుస్తకం పూర్తిగా తప్పుల తడకగా ఉందని, లెక్కలు ఒకదానికి ఒకటి పొంతనే లేదని ప్రభుత్వాన్ని ఎంఐఎం నేత, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తూర్పార పట్టారు. గణాంకాలతో నిలదీశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై అసెంబ్లీలో బుధవారం కొనసాగిన చర్చలో ఎంఐఎం తరపున అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడారు. సాగునీటిశాఖ, విద్యుత్ సంస్థల డిస్కమ్‌లకు, వైద్యారోగ్యశాఖకు కేటాయించిన నిధుల్లో తేడాలు ఉన్నాయని, ఆ లెక్కలకు పొంతన లేకుండా పోయిందని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ 2 లక్షల రుణమాఫీ చేసిందా?

- ఎన్నికల్లో హామీలు.. కోడ్‌తో కాలయాపన
- మళ్లీ ఎన్నికలు వస్తేనే గ్రామాలకు కాంగ్రెసోళ్లు
- ఎంపీ బండి ధ్వజం



గంభీరావుపేట, ఫిబ్రవరి 14: ‘ఎన్నికలు రాగానే కాంగ్రెసోళ్లు గ్రామాలకు వచ్చి హామీలు ఇస్తరు.. అమలు చేయాలని అడిగితే కాలయాపన చేస్తున్నరు.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీపై ఊసెత్తరు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ పేరిట మిగతా గ్యారంటీ పథకాలకు మంగళం పాడుతరు’ అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఆయన చేపట్టిన ప్రజాహిత యాత్ర బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు లింగన్నపేట, కొత్తపల్లి గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ఎన్నికలు వస్తేనే కాంగ్రెసోళ్లు గ్రామాలకు వస్తారని, గ్యారంటీ పథకాల పేరిట హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తారని మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల హామీలో భాగంగా డిసెంబర్ 9న ఇస్తానన్న రూ.2 లక్షల రుణమాఫీ ఏమైంది? మహిళలకు రూ.2500 ఖాతాలో వేశారా? ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. ఈ యాత్రలో బీజేపీ నాయకులు రాణిరుద్రమ, రెడ్డబోయిన గోపి, ఎర్రం మహేశ్, గంట అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల వైస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

- బల్దియా సమావేశానికి బీఆర్ఎస్ కౌన్సిలర్ల గైర్హాజరు
- ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జోక్యంతో సమసిన వివాదం

జగిత్యాల, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. సభ్యుల మధ్య అంతర్గత వివాదానికి తెరపడింది. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి గతేడాది చైర్‌పర్సన్, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. దీంతో గోలి శ్రీనివాస్‌పై అవిశ్వాసం పెడుతూ.. దాదాపు 30 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కవిత రంగంలోకి దిగారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, బీఆర్ఎస్ కౌన్సిలర్లతో సయోధ్య సమావేశం నిర్వహించారు. పార్టీ అందరికీ అవకాశాలు ఇచ్చిందని, భవిష్యత్తులో అందరికీ సమానావకాశాలు ఉంటాయని భరోసా కల్పించారు. అవిశ్వాస తీర్మానంపై పునరాలోచన చేయాలని సూచించారు. కవిత సూచనల మేరకు కౌన్సిలర్లు బుధవారం జరిగిన అవిశ్వాస సమావేశానికి గైర్హాజరయ్యారు. 48 మంది కౌన్సిలర్లు ఉన్న కౌన్సిల్‌లో కేవలం 10 మంది మాత్రమే హాజరు కావడంతో అవిశ్వాసం వీగిపోయినట్టుగా ఆర్డీవో నర్సింహమూర్తి ప్రకటించారు.